సాక్షి
వికారాబాద్
సోమవారం ⋅ 23 ⋅ అక్టోబర్ ⋅ 2023



హక్కులు సాధించుకోవాలి

మాలలు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజిని అన్నారు. 10లో▸



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 10లో▸



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఆ పార్టీశ్రేణులు కోరారు. 11లో▸

న్యూస్‌రీల్

విజయ దశమి శుభాకాంక్షలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: చెడుపై మంచి సాధించిన విజయమే దసరా అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల గనుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఈ విజయదశమి ప్రజలందరి జీవితాల్లో విజయాలు నింపాలని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతులు, మహిళలు, యువత, వ్యాపారులు సుఖశాంతులతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో దసరా వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం



పార్టీలో చేరినవారితో ఉమారెడ్డి తదితరులు

పరిగి: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాల గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకునే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తెచ్చిందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. పేదలు బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ, చిట్యాల సర్పంచ్ రచిత, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

మర్పల్లి: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ విజయంతో గెలిపిస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ పేదలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. సకాలంలో రైతు రుణమాఫీ చేయకపోవడంతో వచ్చిన డబ్బు వడ్డీకే సరిపోయిందని తెలిపారు. ఎంత మంది దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేశారో చెప్పాలని నిలదీశారు. మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. ఆర్భాటంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం జాడ లేకుండా పోయిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దళిత, బీసీ బంధు పార్టీ కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. వికారాబాద్ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు సురేష్, బలవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: దుర్గామాత అలంకరణలో తుల్జామాత

దసరా వచ్చింది.. సరదా తెచ్చింది..

దసరా వేడుకలకు గ్రామాలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. పండుగను పురస్కరించుకొని ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం దుకాణాలు జనంతో కళకళలాడాయి. పలు కాలనీల్లో రావణ దహనం కోసం ఏర్పాట్లు చేశారు.

– వికారాబాద్ అర్బన్



తాండూరు: శాకాంబరీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి మాత



కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, భక్తులు

ఎదురుచూపులే..!

బీజేపీ మొదటి జాబితాలో జిల్లాకు దక్కని చోటు

- నాలుగు నియోజకవర్గాల నుంచి 60 దరఖాస్తులు
- ఒక్కో స్థానం నుంచి పరిశీలనకు ముగ్గురి పేర్లు
- ఒక్క అభ్యర్థినీ ప్రకటించని కమలనాథులు
- రెండో జాబితాపై ఆశలు

వికారాబాద్: బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల మొదటి జాబితాలో జిల్లాకు చోటు దక్కకపోవడంతో నాయకులు ఒకింత అసహనానికి గురయ్యారు. ఆదివారం కమలనాథులు 52 మందితో కూడిన జాబితాను విడుదల చేశారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా ఒక్క నియోజకవర్గానికి కూడా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులు, పార్టీ శ్రేణుల ఉత్కంఠ మరింత ఎక్కువయ్యింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతున్న వేళ పార్టీ అభ్యర్థులను ప్రకటించకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడం ఆశావహులు, పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. మిగతా పార్టీల కంటే బీజేపీ టికెట్ కోసమే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ పడుతున్న వారిలో స్థానికులతో పాటు స్థానికేతరులు కూడా ఉన్నారు. అసమ్మతికి చోటులేకుండా టికెట్లు కేటాయించాలని అధిష్టానం భావిస్తోందని, అందుకే అభ్యర్థుల ప్రకటనకు కొంత సమయం తీసుకుంటున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు. రెండో జాబితాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని నాయకులు తెలిపారు.

గ్రూపు తగాదాలే ఆలస్యానికి కారణమా?

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కనిపిస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎవరికి వారు విడిపోయి పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ నేతలు ఎవరికి వారు విడిపోయి ప్రజల్లోకి వెళుతుండడం, పార్టీ పెద్దలకు నియోజకవర్గ నాయకులపై పట్టు లేకపోవడం తదితర కారణాలు కూడా అభ్యర్థుల ఎంపికలో జాప్యానికి కారణమని తెలుస్తోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రావడం లేదని తెలిసింది.

ఆశావహులు అధికం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న వారు దాదాపు 60 మంది వరకు ఉన్నారు. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ కంటే కూడా ఎక్కువ మంది బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 10మందికి పైగా దరఖాస్తు చేశారు. అయితే ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు లేక ముగ్గురు పేర్లను ఎంపిక చేసిన రాష్ట్ర నాయకత్వం అధిష్టానానికి పంపినట్లు సమాచారం. వికారాబాద్ నియోజకవర్గం నుంచి పీ నవీన్‌కుమార్, బాషాల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పరిగి నియోజకవర్గం నుంచి బూనేటి మారుతి కిరణ్, పరమేశ్వర్‌రెడ్డి, ఈశ్వరప్ప పేర్లను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. తాండూరు నుంచి సహదేవ్, విశ్రాంత పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గం నుంచి పూనం చంద్‌లవూరీ, కూర వెంకటేశ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే వీరితో పాటు మరికొందరు టికెట్ల కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

గరుడవాహనంపై శ్రీవారు

వికారాబాద్ పరిధిలోని ఆలంపల్లిలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పెరుగువసంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి ఇచ్చారు. అనంతరం శ్రీవారు గరుడ వాహనంపై పురవిహారం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. భక్తులు టెంకాయలు కొట్టి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల్లో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

– అనంతగిరి



గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

హామీలన్నీ అమలు చేశాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- మరోసారి ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పరిగిలో కార్యకర్తల సమావేశం

పరిగి: తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి ఎస్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ మున్సిపల్, మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే నివాసం నుంచి ఎస్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు, వచ్చాక గ్రామాల పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలుసని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీల తోపాటు మాట ఇవ్వని అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, షాదీముబారక్ వంటి ఎన్నో పథకాలు పేదలకు అండగా నిలిచాయని అన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోకు ప్రజల ఆదరణ లభించిందని పేర్కొన్నారు. వారంటీ లేని కాంగ్రెస్ గ్యారంటీతో ప్రజల ముందుకు వస్తోందని, ఆ పార్టీ మాటలు నమ్మి ఆగం కావద్దని సూచించారు. కర్ణాటకలో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. తాను ప్రతి గ్రామంలో దాదాపు కోటి రూపాయల వరకు వెచ్చించి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గతంలో మున్సిపల్ అభివృద్ధికి రూ. 15 కోట్లు, ఇటీవల మరో రూ. 45కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలోనే పరిగి అన్ని విధాలా అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా నిలిపామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనిల్‌రెడ్డి, ప్రతిమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు మీర్‌మహమూద్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సయ్యద్‌పల్లి వెంకటయ్య, రవికుమార్, కిరణ్, రవీందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

తమిళనాడు ఎంపీ డాక్టర్ విష్ణుప్రసాద్

చేవెళ్ల: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తమిళనాడు ఎంపీ, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ విష్ణుప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌పార్టీ గాలి వీస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేసేలా ఉన్నాయన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి పామెన బీంభరత్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పదవులు పొంది పార్టీకి ద్రోహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌ను వీడిన వారికి బుద్ధి చెప్పండి
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: ఐదేళ్లపాటు పార్టీ పదవులు పొంది ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ను వీడటం దారుణమని, ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది నాయకులు బీఆర్‌ఎస్‌లో పదవులు పొంది కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. ఇటీవల పార్టీని వీడిన వారిని పరుష పదజాలంతో దూషించారు. అవకాశం మించిపోలేదని పార్టీ నుంచి వెళ్లిన వారు తిరిగి వస్తే ఆదరిస్తామని అన్నారు. అలా కాకుండా పార్టీకి నష్టం కలిగిస్తే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. గతంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన బీజేపీకి బుద్ధి చెప్పానని గుర్తు చేశారు. ఆ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిందన్నారు. దేశంలో ఎవరూ చేయలేని సాహసం తాను చేశానని అన్నారు. తాండూరు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తాను గతంలో పార్టీ మారినట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి ఆగరాదనే తాను, మంత్రి మహేందర్‌రెడ్డి కలవడం జరిగిందన్నారు. ప్రజలు తన వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణా, పీఏసీఎస్ చైర్మన్లు రవిగౌడ్, సురేందర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, పార్టీ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు కరణం పురుషోత్తంరావు, అజయ్ ప్రసాద్, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: బతుకమ్మలతో మహిళలు

సద్దుల సంబురం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు, యువతులు, చిన్నారులు రంగురంగు పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. వాటిని ఒక్కచోట చేర్చి ఆటపాటలతో సందడి చేశారు. లయబద్ధంగా చేసిన నృత్యం ఆకట్టుకుంది.

– వికారాబాద్ అర్బన్

ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం

మంత్రి కేటీఆర్

మొయినాబాద్: భవిష్యత్ మనదే.. పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మండలానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి తనకు అవకాశాలు దక్కడంలేదని.. పార్టీలో తగిన న్యాయం జరగడంలేదని కినుక వహించి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అనంతరెడ్డిని తీసుకుని మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరెడ్డి తన ఆవేదన మంత్రికి తెలియజేశారు. స్పందించిన ఆయన త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రజాసేవకు మరో అవకాశం ఇవ్వండి

డాక్టర్ సబితాఆనంద్



ఎమ్మెల్యే సతీమణి సబితాఆనంద్ ప్రచారం

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యేగా తన భర్తను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబితానంద్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, చేపట్టబోయే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వికారాబాద్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ప్రజా సేవలో ఉంటారని చెప్పారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొడంగల్: తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి అక్రమ రవాణాను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నామన్నారు.

పదవులు తీసుకుని పార్టీలు మారుతున్నారు

- వారిని ప్రజలు నమ్మరు
- ఎఫ్ఎస్‌సీఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దేముల్: స్వలాభం కోసం పార్టీలు మారే నేతలను ప్రజలు నమ్మరని పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగి కండువాలు మార్చుతున్నారని వారితో నష్టం లేదన్నారు. మారేపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్ము గోపాల్‌రెడ్డి భార్యను కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చేశారు. అయినప్పటికీ వారి పార్టీ మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వెంటనే పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. పెద్దేముల్, జనగాం, ఖాణాపూర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్‌నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో పలువురు మండి పడ్డారు. పార్టీ కోసం పని చేసిన నాయకులకు అందరికి సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక వ్యక్తి తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజిల్‌రెడ్డి, దాసరి నర్సింలు, నరేశ్‌రెడ్డి ఆనంత కోటి, శిబ్లీ, రవి కిరణ్, అశోక్ గౌడ్, నరేష్, రాము,శ్రీను, రాజు పాల్గొన్నారు.

తంగేడు పువ్వు.. పల్లెల్లో పూసిన నవ్వు

చివరి రోజు బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఆడపడుచులు, చిన్నారులు అందగా ముస్తాబై ఉయ్యాల పాటలతో చప్పట్లతో లయబద్ధంగా ఆడిపాడారు. అనంతరం గౌరమ్మను చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు. వెళ్లిరా గౌరమ్మ.. మళ్లీ రావమ్మా అంటూ వీడ్కోలు పలికారు. – వికారాబాద్ నెట్‌వర్క్



కొడంగల్: ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



కుల్కచర్ల: కుస్మసముద్రంలో..



కొడంగల్ రూరల్: బతుకమ్మలతో మహిళ, చిన్నారులు



మర్పల్లి: పెద్దాపూర్‌లో..



పెద్దేముల్: జనగాంలో..



పూడూరు: మీర్జాపూర్‌లో ప్రతిమారెడ్డి



తాండూరు: ఎన్టీఆర్ కాలనీలో..



మర్పల్లి: పంచలింగాలలో ..

నాయకులు కాదు.. పార్టీ గెలుపే ముఖ్యం

- కాంగ్రెస్ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్
- టీఆర్ఆర్, బీఎంఆర్ చర్చలు సఫలం

తాండూరు: నాయకులతో తనకు సంబంధం లేదని.. అధిష్టానం అభీష్టం మేరకు టికెట్ ఎవరికి ఇచ్చినా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ ప్రకటించారు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆయన్ను ఆదివారం డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పరామర్శించారు. తాండూరు టికెట్ వస్తే తనకు సహకరించాలని బీఎంఆర్ కోరగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిన వారంతో తమకు మద్దతివ్వాలని కోరారు.



రమేష్ మహరాజ్‌ను కలిసిన మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంజిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నుంచి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్యర్తలు విసుగెత్తి హస్తం వైపు చూస్తున్నారన్నారు. అధికార పార్టీ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి, బంగ్ల యాదయ్యగౌడ్, శాంత్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హక్కులను సాధించుకోవాలి

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రజిని

పరిగి: ఐక్యంగా ఉంటూ రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రజిని అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో అలాయ్ బలయ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలసికట్టుగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యమన్నారు. మాలల అభ్యున్నతికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరికి సమానంగా అందిస్తున్నామన్నారు. ఎవరికి ఎలాంటి సాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. మాల కుల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. 9 శాతం ఉన్న మాలలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వాటా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, రాజేశ్, బాలకిషన్, నర్సింహులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న రజిని

సొంత మండలంలో ‘పైలెట్’కు షాక్

బషీరాబాద్: అధికార బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సొంత మండలం నుంచి తొమ్మిది మంది సర్పంచ్‌లు పలువురు ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు, నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నేత మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. మండలంలోని మాసాన్‌పల్లి, సర్పంచ్ భీమప్ప, ఉప సర్పంచ్ మల్లేశ్, గొట్టిగకుర్దు సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, కుప్పన్‌కోట్ సర్పంచ్ పద్మ, భోజ్యానాయక్‌తండా సర్పంచ్ శాంతిబాయి, కొర్విచెడ్ ఘని సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ శ్వేత, బాబునాయక్ తండా సర్పంచ్ సూర్యానాయక్, హంక్యానాయక్ తండా సర్పంచ్ దేవసింగ్, బాద్లాపూర్ సర్పంచ్ సుభాష్, కంసాన్‌పల్లి సర్పంచ్ అనురాధ, ఉపసర్పంచ్ పద్మమ్మ, మంతట్టి ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ గూటికి చేరారు. వీరిలో మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు వర్గం వారే ఉండడం గమనార్హం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శంకరప్ప, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లతో మనోహర్‌రెడ్డి

‘కారు’ దిగి కాంగ్రెస్ గూటికి చేరిన తొమ్మిది మంది సర్పంచ్‌లు



కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువత

జోరుగా హుషారుగా..

కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్‌తో కళకళలాడుతోంది. జనవరిలో ప్రాజెక్టు అలుగు పోసిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా సంబంధిత అధికారులు బోటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. అదే నెలలో నలుగురు యువకులు నీటిలో మునిగి మృత్యువాత పడగా.. నాటి నుంచి బోటింగ్‌కు అటవీ అధికారులు, పోలీసులు అనుమతులు నిరాకరించారు. దీంతో తాజాగా.. కాయకింగ్ బోటింగ్, జేకేఎంఆర్ సంస్థ సిబ్బంది జలాశయం చివరన బోటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ బురద నీరు ఉన్నా.. యువత ఉత్సాహంతో బోటింగ్ చేస్తున్నారు. కరంట్ లొకేషన్ ద్వారా పర్యాటకులను 16 కిలో మీటర్లు రప్పించి బోటింగ్ నిర్వహిస్తున్నారు.

సద్దుల సంబురం

వేడుకల్లో సింగర్ మధుప్రియ సందడి

తాండూరు: తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి సద్దుల బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు నియోజకవర్గంలోని మహిళలు బతుకమ్మలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్నారు. పైలెట్ రోహిత్‌రెడ్డి సతీమణి ఆర్తిరెడ్డితో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం సింగర్ మధుప్రియ పాటలతో సందడి చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు సాయిపూర్ ప్రాంతంలోని మహిళలతో కలిసి బతుకమ్మలతో ఊరేగింపుగా కళాశాల మైదానానికి చేరుకుని ఆట పాటలతో అలరించారు.



సతీమణి ఆర్తిరెడ్డితో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సంబురాల్లో సింగర్ మధుప్రియ సందడి



బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న ఆర్తిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దీప

డ్రగ్స్ విక్రేతకు రిమాండ్

నిందితుడి వద్ద 3.5 కేజీల హాష్ ఆయిల్ స్వాధీనం

మీర్‌పేట: సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.17.50లక్షల విలువైన నిషేధిత హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మీర్‌పేట్ పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడించారు. వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి తెలిపిన ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బొబ్బ సూర్యప్రకాశ్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలంకు చెందిన పోతురాజుతో పరిచయం ఏర్పడింది. ఆయన వద్ద రూ.7లక్షలకు 3.5 కేజీల హాష్ ఆయిల్ కొనుగోలు చేశాడు. దీన్ని సంతోష్‌నగర్‌లో విక్రయించేందుకు ఈ నెల 21న పీఎస్ పరిధిలోని మంద మల్లమ్మ ప్రాంతానికి వచ్చాడు. అనుమానాస్పందంగా కనిపించడంతో పోలీసులు విచారించగా హాష్ ఆయిల్ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడి వద్ద హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ గోవిందస్వామి సిబ్బంది పాల్గొన్నారు.



హాష్‌ఆయిల్‌ను చూపుతున్న ఏసీపీ భీంరెడ్డి, సీఐ కిరణ్‌కుమార్

వైభవంగా అఖండజ్యోతుల మహోత్సవం

- చౌడేశ్వరీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఊరేగింపులో జ్యోతులతో భక్తుల నృత్యాలు

కొడంగల్ రూరల్: పట్టణంలో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా తొగుట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరిమాత అఖండ జ్యోతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో తొగుట వీర క్షత్రియ సంఘం సభ్యులు అమ్మవారి ఆలయంలో మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం అమ్మవారికి గంగా జలంతో అభిషేకం చేసి ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయం నుంచి అఖండ జ్యోతులతో ఊరేగింపుగా పట్టణంలోని గొల్ల చౌడప్ప ఇంటి వరకు వెళ్లారు. వారి ఇంటి నుంచి బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా అఖండ జ్యోతులతో నృత్యాలు చేస్తూ, దండకాలు వేస్తూ, కీర్తనలు, భజనలు చేస్తూ, పాటలు పాడుతూ అమ్మవారిని స్మరిస్తూ ఆలయానికి చేరుకున్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు